నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడి.నాగేశ్వరరావు తెలిపారు. బాపూనగర్ ఫీడర్ పరిధిలోని ఓవైసీ నగర్ నక్లెస్ హోటల్, ఆకాశ్ నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు...

◆ చిక్కడపల్లి ఫీడర్ పరిధిలోని నారాయణగూడ వెంటేశ్వరస్వామి టెంపుల్ బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాలలో 10.30 నుంచి 11 గంటల వరకు..

◆ సీతా కాలనీ ఫీడర్ పరిధిలోని శివం, శరధా నగర్, సాయిబాబానగర్, అంబార్‌పేట్ తదితర ప్రాంతాలలో 10.30 నుంచి 11 గంటల వరకు..

◆ విద్యానగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్ గుండు, అడిక్‌మెట్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు...

◆ ఆర్టీసీక్రాస్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విశాల, అంబేద్కరనగర్, హరినగర్, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాలలో సాయంత్రం 4 గంటల నుంచి 4.30 వరకు...

◆ స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని శివాలయం టెంపుల్, రాజాడీలక్స్, చర్చ్‌గల్లీ, ఎన్‌బీకే ఎస్టేట్ తదితర ప్రాంతాలలో సాయంత్రం 4.30 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాచిగూడ ఏసీపీగా బాల గంగిరెడ్డి



కాచిగూడ: కాచిగూడ ఏసీపీగా బాల గంగిరెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. సౌత్ జోన్ స్పెషల్ బ్రాంచి ఏసీపీగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన కాచిగూడకు బదిలీపై వచ్చారు. ఆయన అంబర్‌పేట డీఐగా, పలు పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్‌గా, సుల్తాన్‌బజార్ ఏసీపీగా కూడా బాధ్యతలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాల గంగిరెడ్డి మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారికైనా శిక్షలు తప్పవన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఇంద్రసేన్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివి



ఇంద్రసేన్ రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ వెంకట ప్రసాద్ రెడ్డి

నల్లకుంట: దివంగత ఎమ్మెల్సీ ఎస్.ఇంద్రసేన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు మరువలేని వని పలువురు వక్తలు కొనియాడారు. అనంత మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ ఎండీ డాక్టర్ ఎస్. వెంకటప్రసాద్‌రెడ్డి, రోహిత్ సేన్ రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంటలో మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎస్. ఇంద్రసేన్ రెడ్డి 83వ జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనికి హాజరైన కాంగ్రెస్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, ఆర్.జనార్దన్‌రెడ్డి, రెడ్డి జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులు ఇంద్రసేన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అనంత డెంటల్ క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే శంకరమఠం మార్కెట్ రోడ్డులో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వంగత నేత కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బొమ్మిడి శ్రవణ్ కుమార్, జి.మధుసూదన్‌రెడ్డి, మురళి, మధుసూదన్, దయానంద్, మహేష్ యాదవ్, శ్రవణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టింది..!

- జోన్ వ్యాప్తంగా ఈదురు గాలులతో భారీ వర్షం
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు
- పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు



బాపునగర్‌లో భారీ వర్షానికి విరిగిపడిన భారీ వృక్షం

చిక్కడపల్లి: ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో శుక్రవారం సాయంత్రం భారీగా కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రెండు గంటలు దంచికొట్టిన వర్షానికి కాలనీలలో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వర్షం ఇలాగే కురిస్తే తమ ఇళ్లలోకి వరదనీరు వస్తుందేమోనని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. వర్షానికి కాలనీలలో అక్కడక్కడ చెట్లు నేలకొరిగాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఓ పక్కకు ఒరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.

◆ అకాలవర్షం నేపథ్యంలో సంబంధిత అధికారులను గాంధీనగర్ కార్పొరేటర్ పావని అప్రమత్తం చేశారు. అశోక్‌నగర్, బాపునగర్, వివేక్‌నగర్‌లలో చోట్ల చెట్లు విరిగిపడటంతో ఆందోళనలకు గురైన స్థానికులు కార్పొరేటర్ పావనికి సమాచారమిచ్చారు. కార్పొరేటర్ తక్షణమే స్పందించి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ ఎమర్జెన్సీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అధికారులు, సిబ్బంది వెంటనే ఆయా ప్రాంతాలకు చేరుకొని విరిగిపడిన చెట్ల కొమ్మలు తొలగించారు. ఎక్కడా వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించారు. చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలవొద్దని ప్రజలకు సూచించారు.

కాచిగూడ డివిజన్‌లో విరిగిపడిన చెట్లు..

కాచిగూడ: డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ఉన్న చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. రోడ్లపై చెట్లు అడ్డుగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఉమారాణి, బీజేపీ నేతలు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బందిని, ట్రాఫిక్ పోలీసులను పిలిపించి చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. చెట్ల కొమ్మలను వెంటనే రోడ్లపై నుంచి తరలించారు.

ముషీరాబాద్‌లో రోడ్లపై నిలిచిన నీరు..



ముషీరాబాద్‌లో భారీ వర్షంతో రోడ్డుపై నిలిచిన వరద నీరు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం పడింది. వర్షం నీరు రోడ్లపై ఏరులై పారడంతో పాదాచారులు, వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలైన పార్శిగుట్ట, బాపూజీనగర్, వినోభానగర్, సాగర్‌లాల్ ఆసుపత్రి వీధి, భోలక్‌పూర్‌లోని అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాలలో వర్షం నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. దాయార మార్కెట్ నుంచి సాగర్ లాల్ ఆసుపత్రి వరకు ఇటీవల మంచినీటి పైపులైన్ పనులు పూర్తి చేసి రోడ్డు వేయకపోవడంతో పైపులైన్ నిర్మాణం కోసం తవ్విన చోట రోడ్లంతా బురదమయంగా మారింది. వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కూలిపోయిన నాలా రిటైనింగ్ వాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని నెహ్రూనగర్ వద్ద ఉన్న మూసీ నాలా రిటైనింగ్ వాల్ శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూలిపోయింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ కె.రవిచారి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్లు చేపట్టిన నాసిరకం పనుల వలనే కూలిపోయిందన్నారు. చిన్నపాటి వర్షానికే ఇలా జరిగితే రానున్న వర్షాకాలానికి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నాని, వెంకటేష్, టిల్లు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



కూలిన రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి



అశోక్‌నగర్‌లో గాలి దూమారానికి విరిగిపడిన భారీ వృక్షం



నింబోలిఅడ్డ కుమార్ థియేటర్ సమీపంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు



బర్కత్‌పురలో చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలి



గ్రూప్-1 విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తున్న ఆర్ కృష్ణయ్య, నీల వెంకటేష్



ప్లకార్డు పట్టుకున్న గ్రూప్-1 విద్యార్థి

కవాడిగూడ: గ్రూప్-1 పరీక్షా ఫలితాలలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నిరుద్యో జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం చేయొద్దని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రూప్-1 పరీక్షా కేంద్రాల కేటాయింపులలో టీజీపీఎస్సీ అధికారలు నిర్లక్ష్యం వహించారని అన్నారు. అవకతవకలకు బాధ్యులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్ష పత్రాల లీకేజీ ఓఎంఆర్ సీట్ల లోపాలు బయోమెట్రిక్ హాజరులేని అంశాలపై బాధ్యులైన అధికారులపై విచారణ చేసి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. గ్రూప్-1 పరీక్షలను మరోసారి నిర్వహించి విధివిధానాలను పారదర్శకంగా పునఃసమీక్షించాలన్నారు. రికౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకొని అభ్యర్థులకు సైతం మార్కులు తగ్గించడంలో అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ ధర్నాలో బీసీ సంఘాల నేతలు గుజ్జ సత్యం, జనార్దన్, సతీష్ మోదీ, రాందేవ్, లింగస్వామి, రవియాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఏసుప్రభు శిలువ వేసిన రోజై గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని క్రైస్తవులు చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్‌లు ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. ఏసు ప్రభు భక్తి గీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చ్, ప్రార్థన వీరుల చర్చ్, యునైటెడ్ ఫెలోషిప్ చర్చి తదితర ప్రాంతాలలోని చర్చిలలో క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పాస్టర్ బ్రహ్మం, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శంకర్‌ముదిరాజ్, ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చుకుర్తి ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



చిక్కడపల్లి: గ్రంథాలయ ఉద్యోగుల సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ హామీ ఇచ్చారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి పి.పద్మజ టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కె.శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు సంస్థ కార్యదర్శితో కలసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కార్యదర్శి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ స్పోర్ట్స్ కార్యదర్శి బి.శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శి వైదిక శాస్త్రం కార్మిక సభ్యులు ముకీద్, లైబ్రరీ విభాగం కార్యదర్శి వరప్రసాద్, అసోసియేట్ ప్రసిడెంట్ బొల్లం మహేందర్, సత్యనారాయణ, సాహితీ శ్రీదేవి, పెన్షన్ పేమెంట్ రామిరెడ్డి, ఎంఎస్‌జే శేఖర్, సీఎం రమేష్, రతన్‌సాయి, సూర్య, ఎక్సైజ్ శాఖ సభ్యులు శివ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో అగ్ని ప్రమాదం



ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ దేవునితోట వెనక వీధిలో గల బీఎస్ఎన్ కార్యాలయం వద్ద అర్ధరాత్రి చెత్తకుప్పలో మంటలు చెలరేగి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకున్నాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానిక ప్రజలు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు ఫైర్ ఇంజిన్‌లతో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు విపరీతంగా ఎగిసిపడడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో విద్యుత్ తీగలు కాలిపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏడీఈ సంపత్‌కుమార్, ఏఈ సంతోష్‌ఆనంద్‌లు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ గౌస్‌ఉద్దీన్ ఘటన స్థలానికి చేరుకోని అగ్ని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను కోరారు. ముందు జాగ్రత్త చర్యగా ముషీరాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని అటుగా ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

శివపార్వతుల రథోత్సవం



వీరభద్ర, నందికోల సేవ వీర విన్యాసాలు శివపార్వతుల రథోత్సవం వైభవంగా జరిగింది. కోలార్ కర్ణాటక రాష్ట్రం నుంచి వీర పురంతులు, అర్చకులు శర్మ పాల్గొన్నారు. - చిక్కడపల్లి

రజతోత్సవాలను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను విజయవంతం చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యాక్రమాలు, పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయకుమార్, జాఫర్, పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి



ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని రెయిన్ బో హోం అనాధాశ్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాబాబాయి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. అనాథ పిల్లలకు అండగా నిలిచి వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. బాలికలు క్రమశిక్షణతో బాగా చదువుకుంటారని వారికి తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, ప్రభాకర్, మోహిన్, ఎయిర్‌టెల్ రాజు, పరశురాంయాదవ్, కొండా సహదేవ్, వహీద్ అలీ, ఫీరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం



చిక్కడపల్లి: బాపూనగర్ శ్రీరాజరాజేశ్వర దేవాలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలు, పంచామృతంతో అభిషేక చేశారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు మండపారాధన, లక్ష్మీగణపతి, దేవి హోమం, అమ్మవారి మూలమంత్ర హోమం, పూర్ణహుతి, విశేష ఆశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వి.నవీన్‌కుమార్, రత్నసాయి చంద్, దామోదర్, శ్రీకాంత్, పి.నర్సింగ్‌రావు, అందోల్ రాజు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అంజన్‌కుమార్ యాదవ్ వెంటనే క్షమాపణ చెప్పాలి

చిక్కడపల్లి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ వెంటనే క్షమాపణ చెప్పాలని ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రాం డిమాండ్ చేశారు. పార్లమెంట్ సభ్యుడిగా అనుభవం ఉన్న అంజన్‌కుమార్ యాదవ్ ఇలా మాట్లాడటానికి సిగ్గుపడాలన్నారు. మాటలు వెనక్కు తీసుకోకుంటే ముషీరాబాద్ నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ దిష్టిబొమ్మను ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో దహనం చేశారు. ఈ నిరసనలో నేతలు గానుగపాటి సూర్యనారాయణ శర్మ, బి.రాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శేషసాయి, రవిచారి, నవీన్ గౌడ్, వెంకటేష్, రఘునాథ్, శివాజి తదితరులు పాల్గొన్నారు.

◆ తిలక్‌నగర్ చౌరస్తాలో నిరసన

నల్లకుంట: మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం నల్లకుంట తిలక్‌నగర్ చౌరస్తాలో ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజీ. బాబు, నాయకులు ఎంబీ కిశోర్ కుమార్, కె.లక్ష్మణ్‌కుమార్, శ్యామ్‌రాజ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు మల్లంపేట రమేష్ రాము తదితరులు



తిలక్‌నగర్ చౌరస్తాలో అంజన్‌కుమార్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

బీసీల మహాధర్నాలో నేతల డిమాండ్



బీసీల మహాధర్నాలో వీహెచ్ మధుసూదనాచారి, ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్య, నరేందర్‌గౌడ్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రజల్లో ఏ విధంగా చైతన్యం వచ్చిందో అదే విధంగా నేడు బీసీలలో రాజ్యాధికారం కోసం చైతన్యం వచ్చిందని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద బీసీల మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వినయ్ కుమార్, జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ తదితరులు హాజరై మద్దతు ప్రకటించారు.

◆ ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బీసీలకు రాహుల్ గాంధీపై నమ్మకం ఉందన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపైనే నమ్మకం లేదన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలలో బీసీలకు రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ శాఖలలో కీలకమైన గ్రూప్-1, గ్రూప్-2 అధికారులను బీసీలను నియమించకపోవడం సరికాదన్నారు. బీసీల న్యాయమైన హక్కులను సాధించుకోవాలని అప్పుడే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్నారు. బీసీలకు ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలన్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

◆ వీహెచ్ మాట్లాడుతూ... బీసీలకు దేశవ్యాప్తంగా ఇదోక సువర్ణ అవకాశమని బీసీ కులగణన ఇప్పుడు జరగకపోతే మరెప్పుడు జరగదన్నారు.

◆ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. 5 శాతం రెడ్లు, 42 మంది ఎమ్మెల్యేలు ఉంటే 60 శాతం ఉన్న బీసీలు 19 మంది ఎమ్మెల్యేలు ఉండటం దారుణమని అన్నారు. నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి 9వ షెడ్యూల్ చేర్చాలన్నారు. ఈ ధర్నాలో బీసీ సంఘాల నేతలు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు చీపురు మల్లేష్ యాదవ్, నందగోపాల్, గుజ్జ సత్యం, పుటం పురుషోత్తం రావు, మహిళనాయకురాలు జయంతితోపాటు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.